# లోకం మారెను – తీరే మారెను

# ఎపిసోడ్ – 15

మూలం : డా. అనురాగ్ శర్మ

స్వేచ్ఛానువాదం: పైడి ముక్కల ఆనంద్ కుమార్

( పుట్టినరోజు సంబరాలు.....బెలూన్లు పగిలిని చప్పుడు......డి.జె.ధ్వనులు..... కోలాహలం )

మీరా — సృష్టీ......సృష్టీ....యిక రా ! డాన్సులు చేసింది చాలు, కేక్ కట్ చేద్దువుగాని, రా ! అందరూ ! ఇక్కడికి రండి ! సృష్టి కేక్ కట్ చేస్తుందహో !

సృష్టి — అమ్మా ! సుజాతక్క ను పిలువు ముందు ! అక్క లేకుండా నేను కేక్ కట్ చేసేది లేదు.

సుజాత — నీ వెనకే వున్నానే. అమ్మనెందుకు హడావుడి పెడతావు. ముందు కొవ్వొత్తి వెలిగించు. రంగు రంగుల కొవ్వొత్తి..... అది ఆరిపోతుంది. ఇదివరకైతే వయస్సెంతో అన్ని కొవ్వొత్తులు వెలిగించి ఆర్పేసే వాళ్ళం.

సృష్టి — వయస్సు తెలవ కూడదనేనా ఒక్కటంటే ఒక్కటి...ఒక్క కొవ్వొత్తితో లాగించేస్తున్నాం. ( అందరూ నవ్వారు )

శ్రీమతి ప్రియ — అదేంటి మీరా ! డాక్టరు గారు కనిపించరేం ? మీ వారిక్కడ లేరా..? ఎటు వెళ్ళారు ?

మీరా — మరేం లేదు ప్రియా ! ఆయన ఊళ్ళో లేరు. ఈ రోజు రాత్రికి గాని వారి విమానం మన శంషాబాద్ లో దిగదు. సృష్టీ ! రెడీనా ? ఇంక కొవ్వొత్తి వెలిగించు. ( స్...ధ్వని ) ( కేకలు, ఈలలు ) చప్పట్లు ( పాట అందరూ.. హేపీ బర్త్ డే టూయూ....హేపీ బర్త్ డేటూ సృష్టీ...హేపీ బర్త్ డే టూయూ ) ( 'ఇదిగిదిగో ముందు ఈ కేకు ముక్క తిను...అబ్బా...ఆ క్రీం మొహానికి రాయకండి....అదిగో, చంద్రిక

స్వీటు తినదట. క్రీం నోట్లో కుక్కండి' అంటూ గోలగోల గా అరుపులు...క్రమంగా fade out )

విరామ సంగీతం

| | |
|---|---|
| సృష్టి | అబ్బ ! పన్నెండైంది......ఎంత హడావుడి. అక్కా ! ఇదిగో ఈ బహుమతుల్ని చూడు. ఇదిగిదిగో....దీనికి నీరూ, ఉప్పు కలిపితే పైన వున్న గడియారం తిరుగుతున్నది. |
| సుజాత | ఈ ఫ్యాన్ చూడు. ఇది సోలార్ సెల్ తో తిరుగుతుంది. |
| సృష్టి | ఔనౌను. చాలా బాగుంది. |
| మీరా | ఇంక చాలు సృష్టి ! రాత్రి బాగా పొద్దుపోయింది. పడుకోండి. ఆ బహుమతులన్నింటినీ రేపు తీరిగ్గా చూడొచ్చు. |
| సృష్టి | అబ్బా ! నాకు నిద్ర రావడం లేదు అమ్మా ! కొద్దిసేపు ఏదైనా మాట్లాడుకుందాం. ఇంతలో నాన్న వచ్చేస్తాడు. |
| మీరా | ఈ రోజు తో నీకు 12 ఏళ్ళు నిండాయి. అంటే teen age లోకి ప్రవేశించావన్న మాట. అయినా చిన్న పిల్లలా మాటలే....మాటలు ! నేను రేపు ఒక పవర్ పాయింట్ ప్రదర్శన యివ్వాలి. నేను దానికి కొంత materials తయారు చేసుకోవాలా లేక నీకు కబుర్లు చెప్తూ కూర్చోవాలా ? |
| సుజాత | అమ్మా ! నీ పని నువ్వు చూసుకో ! నేనూ, సృష్టి మాట్లాడుకుంటూ కూర్చుంటాంలే ! ఈ రోజు దాని పుట్టిన రోజు. దాని కోరిక ఎందుకు కాదనాలి ? |
| మీరా | ( నవ్వింది ) సరే నమ్మా ! నీ యిష్టం ! |
| సృష్టి | అమ్మా ! నీ పవర్ పాయింట్ ప్రదర్శన లో subject ఏమిటి ? |
| మీరా | శక్తి రూపాలు.. వీటిని ఎలా నిలువ చేసుకోవాలి ? అనే అంశం మీద మాట్లాడాలి. |
| సృష్టి | చాలా మంచి సబ్జెక్టు. కాని ఉత్తిగా మాట్లాడితే సరిపోతుందా ? మనం కూడా శక్తి రూపాలను ఆదా చేసుకోవాలి కదా ! |
| సుజాత | ఒహ్హో సృష్టీ ! ముందు అమ్మను ప్రిపేర్ కానివ్వు. మాట్లాడనివ్వు. |

| | |
|---|---|
| | తర్వాత మనం ఆచరణ గూర్చి మాట్లాడదాం. |
| సృష్టి | నీకు తెలియదక్కా – ఈ అంశం మీదే ఒక ప్రాజెక్ట్ చేయాల్సి వచ్చినప్పుడు నేను యిబ్బందులు ఎదుర్కొన్నాను. |
| మీరా | ఇబ్బందులా ? ఎప్పుడు ? ఎక్కడ ? |
| సృష్టి | విద్యుత్తు కూడా ఒక శక్తి రూపం కదా ! దానిని మనం ఆదా చేసుకోవాలి కదా. దీని మీద కొన్ని పోస్టర్లు తయారు చేశాను. |
| మీరా | పోస్టర్లా ? ఏం పోస్టర్లు ? |
| సృష్టి | మీకు తెలుసు. మనం గది నుండి బయటకు వెళ్ళేటప్పుడు విద్యుద్దీపాలను ఆపివేయం. ఫ్యాన్లు తిరుగుతూనే వుంటాయి. అలాగే ఇంధనం వాడకం...పెట్రోలు, డీజిలు వాడే కార్లూ, బైక్ లు మొదలైనవి యిష్టం వచ్చినట్లు వాడే కంటే ఎక్కువగా పబ్లిక్ ట్రాన్స్ పోర్టు అంటే బస్సులు, రైళ్ళు వాడాలి. ఒకేవైపు చాలా మంది వెళ్తుంటే ప్రతి ఒక్కరూ తమ తమ బండ్లు తీసుకుని బయల్దేరడం కంటే కార్లను, బైకు లను సమూహంగా ఏర్పరచుకొని తక్కువ బండ్లను వాడుకోవాలి. |
| సుజాత | సర్లే...వీటన్నింటి మూలంగా ఎనర్జీ అంటే విద్యుత్తు గాని, ఇంధనం గాని ఆదా అవుతుందంటావ్ ? |
| సృష్టి | నిజమే అక్కా ! చూడు. మనం యిక్కడ కూర్చొని వున్నామా, అదిగో బాత్ రూం లో లైటు వెలుగుతున్నది. |
| సుజాత | సర్సరే ! ఆపు చేస్తాను. ( స్విచ్ ఆఫ్ చేసిన శబ్దం )......చేశాను. అమ్మా ! మీ స్వచ్ఛంద సంస్థ నేరుగా ప్రజలతోనే కలిసి పని చేస్తుంది గదా, మళ్ళీ దీని కోసం ఒక పవర్ పాయింట్ ప్రదర్శన అవసరమా ! |
| సృష్టి | మంచి ప్రశ్న అడిగావు అక్కా ! అమ్మా, ఏమంటావ్ ? |
| మీరా | చూడండి – మేము ముందు సమస్యను క్షుణ్ణంగా చర్చిస్తాం. తర్వాత ఈ సమస్య పరిష్కారానికి వ్యూహాలను ఏర్పరుచుకుంటాం. అందుకయ్యే ఖర్చులను అంచనా వేస్తాం. తర్వాతనే డబ్బు వాడి |

నిధుల నుండి తీసుకుంటాం. ఆ తర్వాతనే మా సంస్థ సభ్యులు ప్రజలకు సమస్య పట్ల అవగాహన కలిగించడానికి

సుజాత — వామ్మో అమ్మా ! శక్తి రూపాలను ఎలా ఆదా చెయ్యాల్లో చెప్పడానికి ఎంత శక్తి ఉపయోగిస్తున్నావు !

సృష్టి — అమ్మా ! నీ పవర్ పాయింట్ ప్రదర్శన ఎక్కడివ్వాలి ?

మీరా — వరంగల్లో.

సుజాత — హైదరాబాదు నుండి వరంగల్...ఊ ! యింతకు ముందు సృష్టి తన పోస్టర్ల గురించి మాట్లాడినప్పుడు చెప్పిన విషయం గుర్తుంది కదూ...

మీరా — ఏంటది ?

సృష్టి — అమ్మా ! నువ్వు యిక్కడి నుండి వరంగల్ వెళ్ళాలంటే తప్పకుండా రైల్లోనో, కార్లోనో వెళ్తావు. అంటే నువ్వు శక్తి ని ఆదా ఎలా చెయ్యాలో చెప్పడానికి నీ శక్తినే కాకుండా డీజిల్ లేక ఎలక్ట్రిసిటీ నో ఉపయోగిస్తున్నావు. రైల్లో ప్రయాణం అంటే ఈ రూట్లో రైళ్ళు నడిచేది విద్యుత్తు తోనే గదా .

మీరా — ఔను. సరిగ్గా చెప్పావు. దీన్నే 'కర్బన అడుగు జాడ' అంటారు. carban foot print అంటే ఒక వ్యక్తి తను చేసే పనులకు వ్యక్తి శ్వాస క్రియ తో పాటుగా ఆ వ్యక్తి వాడే ఇంధనం వలన వాతావరణం లోకి కర్బన ద్వి ఆమ్లజని విడుదల అవుతుంది.

సుజాత — అటువంటప్పుడు మనం ఇంత కార్బన్ డయాక్సైడ్ ని వాతావరణం లోకి విడుదల చేయడానికి బదులుగా మనకున్న సాంకేతికతను వాడుకుని యిక్కడి నుండే నువ్వు వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించవచ్చుగా.

సృష్టి — ఔనమ్మా ! నువ్విక్కడనుండి వీడియో సమావేశం చెయ్యడం వలన శక్తి ఆదా అవ్వడమే కాదు. నాన్న ఈ రోజు రాత్రికి యింటికి వస్తున్నాడు కాబట్టి మనందరం సరదాగా గడపొచ్చు.

మీరా — కాని.....

| | |
|---|---|
| సుజాత | ( గట్టిగా ) ఒహ్హో.....! నువ్వు నడిపే స్వచ్ఛంద సంస్థ 15 ఏళ్ళ నుండి దిగ్విజయంగా నడుస్తున్నది ! శక్తిని ఆదా చెయ్యండి. కర్బన అడుగు జాడల్ని పడనివ్వకండి  అంటూ నువ్వు ప్రచారం చేసే కార్యక్రమం నీ యింటి దగ్గరనుండి ప్రారంభం కాకపోతే ఎలా ? శక్తిని ఆదా చెయ్య గలిగి నువ్వే యిలా ప్రవర్తిసే నువ్విచ్చే సందేశం ఏమిటి ? |
| మీరా | ఊ...సరే....వరంగల్లో ఎలాగూ మాకు వీడియో సమావేశానికి తగిన సదుపాయాలూ వున్నాయి. నన్ను వారితో ఫోన్లో మాట్లాడనివ్వండి. నా ఫోన్....ఓహ్...దాన్ని కింద హాల్లో సోఫాలో మర్చిపోయినట్లున్నాను.  ఆగండి కిందికి వెళ్ళివస్తాను. ( వెళ్ళిపోతున్న ధ్వని ) |
| సృష్టి | అక్కా ! భలే ! అమ్మను భలే ఒప్పించావు. |
| సుజాత | నువ్వు మాత్రం ఏమైనా తక్కువ దానివా ? ( ఇద్దరూ ఒకరి చేతులు ఒకరు ఒక సారి గట్టిగా చరుచుకున్నట్లు శబ్దాలు ) |
| సృష్టి | నిజం అక్కా. చాలా మందికి తమ వనరులను చక్కగా సద్వినియోగం చేసుకోవడం తెలవనే తెలవదు.. ఫోన్లో పోచికోలు కబుర్లు చెప్పుకుంటారు. పోజులు కొడతారు గాని తమ తమ యింట్లోని వస్తువులను సరిగ్గా వాడుకోరు. |
| సుజాత | నిన్ను చూస్తుంటే నాకు ముచ్చటేస్తుందే. నాకు నీ వయస్సులో యింత తెలివి తేటలు లేవేమో అనిపిస్తుంది |
| సృష్టి | సర్లే...మన అమ్మా, నాన్నలు చాలా నయం... మనకు ఆలోచించడం నేర్పారు. పైగా మన అభిప్రాయాలకు  విలువ యిస్తారు. కొంత మంది  తల్లిదండ్రులైతే 'నువ్వు నూర్మూసుకో, నీకేం తెలియదు' అని నోరు మూయించే ప్రయత్నం చేస్తారు. అసలు వాళ్ళ పిల్లలకు ఏమీ తెలవదనుకుంటారు. |
| మీరా | ( వచ్చింది ) ఓ.కె. done ! అందరూ సరేనన్నారు. |
| సృష్టి | మా అమ్మ చాలా మంచిది... |
| మీరా | సర్లే......( మురిపెంగా ) పన్నెండేళ్ళకే నీ కెన్ని తెలివి తేటలే... |
| సృష్టి | సర్సరే...మొదలు పెట్టకు. అంతో యింతో...నేనూ ఆలోచించగలను. |

| | |
|---|---|
| మీరా | శక్తిని ఆదా చేసే మార్గాలు యింకా ఏమైనా వున్నాయంటావా ? |
| సృష్టి | నాకు తెలిసి...బాగా డబ్బున్న వాళ్ళు శక్తి వనరులను సరిగా ఉపయోగించుకోరు. శక్తిని ఆదా చెయ్యరు. |
| మీరా | ( ఆశ్చర్యంగా ) అదేమిటి ? |
| సృష్టి | మనం మాధవి అత్త వాళ్లనే తీసుకుందాం. ప్రతి అంశంలో సున్నితంగా వుంటారు. చివరకు మొక్కల పెంపకంలో జాగ్రత్తలు తీసుకుంటారు. చీమకు కూడా హాని చెయ్యరు. కాని కొద్ది పాటి వేడిని కూడా తట్టుకోలేరు. |
| సుజాత | అరే....ఈ సారి వేసవి కాలం  ఒంట్లో మంటలు వచ్చేంత వేడి వుందిలేవే...ఉష్ణోగ్రతలు పెరుగుతున్నాయిగా . |
| సృష్టి | అక్కా ! ఉష్ణోగ్రతలు వాళ్ళకొక్కళ్ళ కే పెరగలేదు. మా స్కూల్ లో మాకు చలికాలం స్వెట్టర్లు వేసుకోండి అని చెప్తారు. వేసవికాలం వస్తే తప్పనిసరిగా ముదురు రంగు దుస్తులు వేసుకోకండి అని చెప్తారు. అమ్మ కూడా వేసవిలో ఎక్కువగా నూలు చీరలే కట్టుకుంటుంది కాని సిల్కు దుస్తులు వేసుకొని వేసవిలో 'అబ్బో !...అబ్బో...'అని ఆపసోపాలు పడదు. |
| మీరా | సృష్టి చెప్పేది నిజమే. వాళ్ళింట్లో శీతాకాలం గాని వేసవికాలం గాని ఎయిర్ కండీషనర్ నడుస్తూనే వుంటుంది. |
| సృష్టి | మనిషి అన్నాక కొద్దిగానైనా చెమట పట్టకుండా ఉంటుందా ? కొద్ది చెమటను కూడా ఆమె భరించలేదు. |
| సుజాత | వాళ్ళింట్లో ఫ్రిజ్ చూసావా ? అవసరమైనవి, అనవసరమైనవి ఎన్నో ఫ్రిజ్ లో నిండుగా వుంటాయి. ముఖ్యంగా విదేశీ చాక్లెట్లు, తినుబండారాలు. |
| మీరా | అవును, వారింట్లో వుండే పండ్లు, జీడిపప్పు అన్నీ సూపర్ గా వుంటాయి. |
| సృష్టి | అమ్మా ! ఎ ఋతువులో దొరికే పళ్ళు ఆ ఋతువులో తాజాగా కొనుక్కొని తినాలి. ఆకు కూరలు, కూరగాయలు, పండ్లు అన్నీ నిలువ చేసి ముగ్గబెట్టి తినడం కాదు. అలా ఫ్రిజ్ వాడకం |

| | |
|---|---|
| | వల్ల...నువ్వేమన్నావ్...అదే...అడుగుజాడ....ఏం అడుగుజాడ ? |
| సుజాత | కార్బనపు అడుగు జాడ. |
| సృష్టి | ఆ ! అదీ ! అది పెరగడం లేదా ? మనకు ఆపిళ్ళు సంవత్సరం పొడుగునా దొరుకుతాయి. వేసవిలో పుచ్చకాయలు, కర్బూజాలు, మామిడి పండ్లు...ఇప్పటికీ అత్త ఏమంటుంది ? 'నాకు శీతాకాలంలో కూడా మామిడి పండ్లు దొరుకుతాయి తెలుసా' ( అనుకరించింది ). మనం యిలా చెయ్యడం వల్లనే భూతాపం పెరుగుతున్నది. అంతేకాకుండా అనేక కొత్త రోగాలు పుట్టుకొస్తున్నాయి. |
| మీరా | నిజం చెప్తున్నావు సృష్టీ ! మనకు వచ్చే ఆపిళ్ళు ఎక్కువగా శీతల గిడ్డంగుల నుండి వస్తాయి. ఎంతకాలం నిలవ వున్నవో మనకు తెలవదు. వాటి రుచి మారక పోవచ్చు గాని వాటి పోషక విలువలు ఎప్పుడో అడుగంటి వుంటాయి.ధరలు మాత్రం తగ్గవు. ఆ శీతలీకరణ గిడ్డంగుల చార్జీలు కూడా కలిపి మన దగ్గరే వసూలు చేస్తారు. |
| సుజాత | అమ్మా ! మీ స్వచ్ఛంద సంస్థ గ్రామ స్థాయిలో పని చేస్తుంది కదూ ? |
| మీరా | అవును సుజా ! గ్రామీణులకు కొంత శిక్షణ యిచ్చి వారికి జీవనోపాధి కల్గించడానికి ప్రయత్నం చేస్తాం. విద్యావకాశాలను కల్పిస్తాం. పర్యావరణ పరిరక్షణాంశాలు కూడా తెలియ జేస్తాం. |
| సుజాత | కాని, పట్టణీకరణే పర్యావరణానికి చేటు చేస్తున్నది. కార్లూ, ఇతర వాహనాల నుండి వచ్చే పొగలు, ఫాక్టరీలు విడుదల చేస్తున్న కాలుష్య కారకాలు గాలినీ, నీటినీ కలుషితం చేస్తున్నాయి. పట్టణాలకు వస్తున్న వలస దారులు వీటి వలన అనేక రోగాల బారిన పడుతున్నారు. మరి మీరు గ్రామాల మీద ఎందుకు దృష్టి పెడుతున్నారు ? |
| సృష్టి | పట్టణంలో వీళ్ళ మాట వినే వాళ్ళెవరుంటారు ...అంతేనా అమ్మా.... |

| | |
|---|---|
| మీరా | అదేం కాదు.... |
| సృష్టి | అక్కా ! ధనిక దేశాలన్నీ ప్రపంచంలో కర్బనపు అడుగుజాడలు పెరగడానికి అభివృద్ధి చెందుతున్న దేశాలే కారణమని నిందిస్తున్నాయి గా ! |
| సుజాత | అమ్మా ! మీరు గొప్ప అద్భుతమైన పని చేస్తున్నారు. సందేహం లేదు. కాని ప్రస్తుత పరిస్థితుల్లో పట్టణంలో వుండే ప్రజలు తడి చెత్తనూ, పొడి చెత్తనూ వేరు చేసి చెత్త జమ చేసే మున్సిపల్ వర్కర్ల కు యివ్వడం లేదు. కనీసం ఓపిక కూడా వారికి వుండటం లేదు. చెత్త పట్ల అవగాహన లేదు. |
| సృష్టి | భూమిలో కలిసి పోయి మనకు ఉపయోగపడే తడి చెత్త, మట్టిలో కలిసిపోని ప్లాస్టిక్ లాంటి పొడి చెత్త పట్ల బహుశా మా పాఠశాలల నుండే మేము నేర్చుకుంటే మంచిదేమో. |
| సుజాత | కాని ప్రస్తుతం ఈ చెత్త మీద మాట్లాడటం 'చెత్త' అని అనుకోకుండా ఈ విషయం మీద మీ స్వచ్ఛంద సంస్థలు దృష్టి సారిస్తే మంచిదేమో ! పట్టణ ప్రజలకు అస్సలు పర్యావరణం మీద  అవగాహన లేదని అర్థం కావడం లేదా ? |
| సృష్టి | మన పెద్దమ్మ  కొడుకు వరుణ్ ని చూడు. వరుణ్ అన్నయ్య కేవలం పడవలాంటి తన sport utility vechicle – SUV కార్ ని కేవలం మనకు చూపించడానికి తీసుకుని వచ్చాడు గుర్తుందా. నాకు అన్నయ్య అలా చేయడం అసలేం నచ్చలేదు. |
| మీరా | ఎందుకు సృష్టీ ? అది వరుణ్ కి మొట్టమొదటి కారు. అందుకే మనకు చూపించడానికి తెచ్చాడు. |
| సృష్టి | ( వెటకారంగా ) సర్లే. ఎన్నడైనా తన కారులో మరొకర్ని కూర్చోనిచ్చాడా ? ప్రదర్శనకు గొప్పగా తీసుకుని వచ్చాడు గాని ! పెద్ద కార్లు ఎంత పెట్రోలు లేక డీజిల్ తాగుతాయి. ఇంధనం ఆదా కాక పోగా వాతావరణాన్ని ఎంత కలుషితం చేస్తాయి. |
| సుజాత | అందుకే ఈ మధ్య ఢిల్లీలో ప్రజలు వారంలో కొన్ని కార్లు మాత్రమే తిరిగేలా ప్రయోగం ఒకటి చేశారుగా. ఏది ఏమైనా ఈ మధ్య కార్ల |

| | |
|---|---|
| | కంపెనీ లు విడుదల చేసే కార్లలో కారు లోపలి గాలిని శుభ్రం చేసే ప్యూరిఫయర్లు వున్నాయి. కాని కంపెనీలు, కారు యజమానులు కార్లు బయటకు వదిలే గాలి ఎంత కలుషితంగా వుందో పట్టించుకోవడంలేదు. |
| మీరా | దీన్నే  మనం  ఇన్యువేషన్ అంటే సురక్షితమని అంటున్నాం. సురక్షితం కార్లో వున్న వారికి ! బయట రోడ్ల మీద తిరిగే వారికి అవి వదిలే కాలుష్యాలు సురక్షితం కాదు . ఉదాహరణకి ఈమధ్య గాజు అద్దాలు వాడే భవనాలు వచ్చాయి . వెలుతురుని లోపలకు రానిస్తాయి .కానీ వేడిమిని  కాదు . బయటకు వెళ్ళలేని కాంతి వేడిమిని ఉత్పత్తి చేస్తుంది లోపల గదుల్లో ఉష్ణోగ్రత ఆర్ధత మనకు తగిన విధంగా ఉండేట్లు శీతలీకరణపరికరాలు పనిచేస్తాయి |
| సుజాత | అవును. బయట తలుపులు మూసికొని వున్నా కార్లోకి మనం తలుపు లేయగానే ఎంత వేడి గాలి వుంటుందో మనకు అనుభవమే. లోపల వేడిమి బంధించబడింది. దీన్నే హరిత గృహ ప్రభావం అంటాం. |
| సుజాత | ఈ ప్రభావం శీతల దేశాల్లో బాగా ఉపయోగపడుతుంది. వాళ్ళు నిర్మించుకునే గాజు అద్దాలు గల భవనాలలో బయట చల్లగా వుంటే లోపల వేడిగా వుంటుంది. |
| సృష్టి | మరి మన దేశం ఒక ఉష్ణమండల దేశం. మనమెందుకు మన భవనాల్లో అద్దాలు వాడుతున్నాం ? ఆ వేడిమిని తగ్గించుకోవడానికి ఎయిర్ కండీషనర్లు వాడటం వలన ఎంత విద్యుత్తుని వృధా చేస్తున్నాం ! ఎందుకీ విలాసం ? |

మీరా		నిజమే సృష్టీ ! మా స్వచ్ఛంద సంస్థ శక్తి ని సద్వినియోగం చేయడం పట్ల అవగాహన కలగ చేస్తుంది. భవనాలు ఎంత విద్యుత్తుని ఆదా చెయ్యవచ్చో, ఏం సామాగ్రి భవనం కట్టడంలో ఉపయోగిస్తే మంచిదో మేం చెప్తాం. ఒక భవనం శక్తిని ఆదా చేసే భవనం గా ఉండేట్లు మేము సలహాలిస్తాం. సౌర శక్తి వాడకాన్ని ప్రోత్సహిస్తాం. ఇంటి కప్పుల మీద ఏర్పరచే సౌరశక్తి ప్యానెళ్ళకు కేంద్ర ప్రభుత్వం యిచ్చే సబ్సీడీలను తెలియ జేస్తాం.

సృష్టి		కాని నిజంగా పెద్ద పెద్ద సిటీలలో ముఖ్యంగా హైదరాబాద్, అమరావతి, వరంగల్, విశాఖపట్నం, విజయవాడ, కరీంనగర్ లాంటి సిటీల్లో సోలార్ ప్యానెళ్ళు ఎంత మంది వాడుతున్నారు ? మహా అంటే సోలార్ గీజర్లు, నీటిని వేడి చేసే యంత్రాలకు పరిమితం అవుతున్నారు. కాని వీటి నిర్వహణకు కూడా తడిసి మోపెడు ఖర్చు అవుతుంది.

సుజాత		నిజమే – ఇదంతా నికొలాస్ టెస్లా వ్యవహారంలా వుంది.

మీరా		నికొలాస్ టెస్లా వ్యవహారం ? అదేంటి సుజా ?

సుజాత		మీకు సంజయ్ అనే పెద్ద మనిషి గురించి తెలియదేమో ?

మీరా		ఇక్కడే దగ్గరలో వున్న కాలనీ లో ఉంటాడు గదా ఆయన ?

సుజాత		exactly ! ఆ కాలనీలో ఆయన తన గోడకు సౌర దీపాలు ఏర్పరచాలని భావించాడు. ఏ అధికారీ ఆయనకు సాయం చేయకపోగా కాలనీ సొసైటీ కి ఒక ఎలక్ట్రిక్ గ్రిడ్ మంజూరు అయివుందనీ కాబట్టి దాని నుండే విద్యుత్తు సరఫరా అవుతుందనీ చెప్పారు. ఆయనింకా గుండ్రంగా తిరుగుతూనే వున్నాడు.

సృష్టి		దానిలోకి నికొలాస్ టెస్లా ఎలా వచ్చాడు ?

సుజాత		నికొలాస్ టెస్లా మొదటి సారి ప్రపంచంలో ఒక నగరానికి వీధి దీపాలు వెలిగించిన శాస్త్రవేత్త. న్యూయార్క్ శివార్లలో వున్న ఈ ప్రాంతానికి విద్యుద్దీపాలు వెలిగించడానికి ఎలక్ట్రిక్ కంపెనీ లు అనేక అభ్యంతరాలు పెట్టాయి. చివరకు టెస్లా తనకు రావలసిన లక్షల డాలర్ల రాయల్టీని వదులుకున్న తర్వాతనే ఆయన ప్రజలకు

నగర విద్యుద్దీపాలను యివ్వగలిగాడు.

మీరా ప్రజలు సౌరశక్తి గూర్చి తెలుసుకుని పట్టుబడితే బహుశా మన దేశం లో సౌరశక్తి పూర్తి వినియోగంలోకి వస్తుందేమో. లేకపోతే యిక్కడి విద్యుత్ కంపెనీ లు, అధికారులు అభ్యంతరాలు చెపుతూనే వుంటారు.

సృష్టి అప్పుడు మీ స్వచ్ఛంద సంస్థలకు బాగా పని ఏర్పడుతుంది

( నవ్వులు )

మీరా సృష్టి తన పుట్టినరోజు దినాన్ని ఈ విధంగా మనల్ని ఆటపట్టించడానికి ఉపయోగిస్తున్నది. ఇక నిద్ర పోదామా ?

సృష్టి నేను నాన్న యింటికి వచ్చేదాకా మేల్కొనే వుంటాను.

సుజాత మనం శక్తిని ఆదా చెయ్యడం గూర్చి మాట్లాడుతున్నాం కదా ! మరి విద్యుత్ వినియోగం,విద్యుత్ప్రసారం యిందులో రెండు ముఖ్యమైన అంశాలు గదా.

మీరా మనం వాడే విద్యుత్ పరికరాల స్థాయిని కూడా పరిశీలించాలి. ఉదాహరణకు మనం ఒక వాషింగ్ మెషీన్ కొనాలంటే దానికున్న రేటింగ్ ని గమనించాలి. ఏవి తక్కువ విద్యుత్తు ను ఉపయోగిస్తాయో చూడాలి.

సృష్టి అంటే మనం కొనే పరికరాలు రేటింగ్ అంతర్జాలంలో స్టార్స్ లేకపోతే కొనవద్దా ? ఐదు నక్షత్రాల రేటింగ్ కావాల్సిందేనా ?

మీరా అది కొంత కష్టం కావచ్చు. ఎందుకంటే అంత రేటింగ్ వున్న వస్తువులు ధర కూడా ఎక్కువ. అందరూ కొనలేరు.

సృష్టి కాని, కొన్ని నియమాలైతే ఉండాలి కదా.

సుజాత మనకు నియమాలు ఉన్నాయి. మూడు నక్షత్రాలు....నాలుగు...ఐదు...యిలా ఇవన్నీ పర్యావరణాన్ని కాపాడుకోవటం కోసం మనం ఏర్పరుచుకున్న నియమాలు. వీటితో ఆ పరికరాలకు విద్యుత్తుని ఆదా చేసే సామర్ధ్యం వుందో లేదో తెలుస్తుంది.

మీరా — కాని యింకా చేయాల్సింది చాలా వుంది. ఉదాహరణకి ఎలక్ట్రిక్ కార్లు విరివిగా రావాల్సి వుంది. వాటిని చార్జి చేయగలిగిన ఫిల్లింగ్ స్టేషన్లు కావాలి. గతి శక్తిని తిరిగి పొందే పద్ధతిలో నగర మెట్రో సిస్టంలో కొత్త సాంకేతికత వస్తున్నది. అది కార్ల చలనానికి ఉపయోగపడే విధంగా తీర్చి దిద్దుతున్నారు.

సృష్టి — ఇప్పుడొస్తున్న LED : CFL బల్బులు కూడా విద్యుత్తుని తక్కువ వాడ్తాయి గదా !

సుజాత — నిజమే సృష్టీ ! LED బల్బులు సాంప్రదాయిక బల్బులతో పోలిస్తే 90 % విద్యుత్తుని ఆదా చేయగలిగిన సామర్ధ్యం కలిగి వున్నాయి. అందుకేగా వాటిని ప్రభుత్వం చౌకగా ప్రజలకు అందచేస్తున్నది. కొన్ని ప్రాంతాల్లో విద్యుత్ బిల్లు చూపిస్తే LED బల్బులు చౌకగా యిచ్చేస్తున్నారు.

సృష్టి — అయితే...ఏదీ...యిక్కడే ఎక్కడో పెట్టాను మన బిల్లు....

( నవ్వులు )

మీరా — పెట్రోలియం కార్పోరేషన్ రిసెర్చి అసోసియేషన్ PCRA రేడియోల్లో టి.వి.ల్లో విద్యుత్ వాడకం మీద కార్యక్రమాలను చేస్తున్నది. బ్యూరో ఆఫ్ ఎనర్జీ ఎఫిషియన్సీ కూడా విద్యుత్ ఆదా మీద, సరియైన వాడకం మీద అవగాహన కలగ చేస్తున్నది.

సృష్టి — అమ్మా ! నేను నిన్నొక విషయం అడగాలి. పొద్దున్న అక్క వార్తా పత్రిక గట్టిగా చదువుతుంటే విన్నాను మన ఆహార పదార్ధాలలో పోషక పదార్ధాలు లేవట. నిజమేనా ?

మీరా — ఔను సృష్టీ... నేషనల్ ఇన్ స్టిట్యూట్ ఆఫ్ న్యూట్రిషన్ జాతీయ పోషక సంస్థ, హైదరాబాదు వారు ఈ మధ్య యిచ్చిన నివేదికలో ఈ విషయం వుంది. మట్టిలో సారం తగ్గిపోవడం వలన ధాన్యాలు, తృణ ధాన్యాలు, పండ్లు, కూరగాయల్లో పోషకాహార విలువలు వుండటం లేదని అది తేల్చి చెప్పింది.

| | |
|---|---|
| సృష్టి | అక్కా, , దానికి శక్తి ఆదా చేయడానికి సంబంధం వుందా ? |
| మీరా | విద్యుత్ ఆదా కంటే మనం ఉపయోగించే వ్యవసాయ పద్ధతులకు ఈ విషయం ముడి పడి వుంది. |
| సృష్టి | అదేనమ్మా ! నేననేది కూడా కొంత లోతుగా అర్థం చేసుకుంటే శక్తి ఆదా కిందకే వస్తుంది. మనం కృత్రిమ ఎరువులు చేయడానికి ఎక్కువ విద్యుత్తు వాడుతున్నాం. ఈ రసాయనక ఎరువులు భూసారాన్ని తగ్గిస్తున్నాయి. అలాగే పురుగు మందులు కూడా. |
| సుజాత | అయితే ? |
| సృష్టి | మరి అమ్మ చేస్తున్న పని కూడా నువ్వు ఆలోచిస్తే స్వచ్ఛంద సంస్థలు సేంద్రీయ ఎరువులు ప్రవేశ పెట్టడానికి పాటుపడటం లేదా ? అంటే విద్యుత్తు ఆదా కాదా ? |
| మీరా | నిజమే... మేము కంపోస్టు ఎరువులు రాలి పోయిన ఆకులు మొదలైన వాటితో ఎలా చెయ్యాలో నేర్పుతున్నాం. పేడ ఎలా వాడుకోవాలో చెపుతున్నాం. సేంద్రీయ పురుగు మందుల్ని తయారు చేసే పద్ధతులు చెప్తున్నాం. |
| సృష్టి | అంటే పొలాల్లో మిగిలిపోయిన మొక్కల మొదళ్ళు, ఆకులు తిరిగి ఎరువుగా మారే అవకాశాలు ఏర్పడుతున్నాయి. మన పోషక విలువలు తిరిగి మనం పొందవచ్చు. ఇవన్నీ విద్యుత్ ఆదా చేసే చర్యలే. |
| సుజాత | ఔను. బయోగ్యాస్ కూడా. |
| మీరా | ఆధునిక వ్యవసాయంలో నత్రజని, భాస్వరం, పొటాషియం మాత్రమే వాడతారు. కాని వర్మి కంపోస్టు, ఆవు, బర్రె పేడలలో 16 రకాల ముఖ్యమైన పంట పోషకాలు వున్నాయి. |
| సృష్టి | చూసావా సేంద్రియ వ్యవసాయంతో ఆహార పోషక విలువలు పెరుగుతాయి. మన నేల సారవంతమవుతుంది. మన శరీరాల్లో కూడా శక్తి పెరుగుతుంది. |
| మీరా | వామ్మో- సృష్టీ – నువ్వో పెద్ద సైంటిస్ట్ లా ఆలోచిస్తున్నావే .... |
| సృష్టి | మరేమనుకున్నావ్ ( నవ్వులు ) |

| | |
|---|---|
| సుజాత | రాబోయే తరం పిల్లలు మంచి తెలివి గల వాళ్ళు. భారత దేశ భవిష్యత్తు వారి చేతుల్లో భద్రంగా వుంటుంది. |
| సృష్టి | ఔనా అమ్మా ! |
| మీరా | తల్లీ ! నువ్వు చిన్నప్పటినుండి సాదా సీదా తనాన్ని యిష్టపడ్డావు. ఆడంబరాల జోలికి వెళ్ళలేదు. మన కుటుంబమే అంత ! నీకు అత్యాశ లేదు. స్వార్ధం లేదు. సమస్యని క్షుణ్ణంగా పరిశీలించడం అలవాటైంది. నీ పని మీద నీకు అంకిత భావం, చక్కని ఆలోచనలు, ఇతరులను అర్ధం చేసుకోవడం, పరిష్కారాలు ఆలోచించడం...ఆచరించడం, భయపడకపోవడం, ప్రశ్నించడం...చాలా ఎదిగి పోయావురా... |
| సుజాత | మరింతకీ రేపు వెళ్తున్నారా అమ్మా..... |
| మీరా | లేదు సుజా ! వీడియో సమావేశానికి అందరూ అంగీకరించారుగా ... |
| సుజాత | చూసావా అమ్మా –సృష్టి నీకు రిటర్న్ గిఫ్ట్ కూడా యిచ్చేసింది. |
| మీరా | థాంక్స్ రా ! |
| సృష్టి | వెల్కం అమ్మా ! కానిప్పుడిక నువ్వు, మీ స్వచ్ఛంద సంస్థ జల సంరక్షణ మీద శ్రద్ధ పెట్టాలి. ముఖ్యంగా ఈ మధ్య తరగతి, ఎగువతరగతి కాలనీల్లో... |
| మీరా | తప్పకుండా సృష్టీ ! మేము గ్రామాల్లో, పట్టణాల్లో కూడా జల సంరక్షణ కార్యక్రమాన్ని చేపడతాం. లేకపోతే ముమ్ముందు మనకు మంచి నీళ్ళు దొరకవు. |
| సృష్టి | పొలంలోని నీళ్ళు –పొలంలోకే మళ్ళు ! |
| సుజాత | పట్నంలో నీళ్ళు – కరువుకింక చెల్లు ! |
| మీరా | వేసవిలో ఎయిర్ కండీషనర్ మర్చిపోవడమే మన మిషన్ ( mission ) |
| సృష్టి | వృధాగా పోనివ్వకండి నీళ్ళు. మిగులును కన్నీళ్లు... |
| సుజాత | విద్యుత్ చేయండి ఆదా ! బాగు పడతాం బాగా ! |
| సృష్టి | పబ్లిక్ రవాణా వుండగా ఎందుకింక హైరానా ? |

| | |
|---|---|
| సుజాత | జత చేసుకోండి వాడకం దార్ల పేర్లను. వాడండి సామూహికంగా కార్లను |
| సృష్టి | వాడండి సోలార్ ఎనర్జీ...పెద్దకార్లంటే పెంచండి ఎలర్జీ.. |
| మీరా | వాడండి పొలాల్లో కంపోస్టు ని ! దరికి రానివ్వకండి రసాయన రోస్టుని– |
| సృష్టి,సుజాత | వావ్ ! |
| | ( కాలింగ్ బెల్ ) |
| సృష్టి | నాన్నోచ్చేసారోచ్ ! ( తలుపు తీసిన చప్పుడు ) |
| సుజాత | నాన్నా..ఎలా వున్నావ్ ? |
| నాన్న | ఇంకా మేల్కొనే వున్నారా ....మీరు పెట్టే కేకలు గేటు దాకా వినపడుతున్నాయి. Happy Birthday Srushti ! |
| | ( నవ్వులు ) |
| సుజాత | నానా యిప్పటి దాకా మేల్కొని ఉందాం అని చెప్పి సృష్టి విద్యుత్ వాడకం మీద, ఆదా మీదా మా మెదళ్ళు తినేసింది ? |
| నాన్న | ఏం, కేక్ సరిపోలేదా ? |
| | ( నవ్వులు ) |
| మీరా | సృష్టి కి బర్త్ డే గిఫ్ట్ ఏది ? |
| నాన్న | ఏం తేలేదు. |
| సుజాత | ఏం తేలేదా ? అదీ, జపాన్ నుండి వస్తూ ? |
| నాన్న | ఆ డబ్బుని ఆదా చేస్తే తను కూడా ఏదైనా కొత్త ప్రదేశం చూస్తుందట ! |
| సుజాత | వావ్ ! |
| నాన్న | మీరా ! రేపు వరంగల్ వెళ్ళాలిగా ! |
| సుజాత | లేదు లేదు కాన్సిల్. సృష్టి కాన్సిల్ చేయించింది. |
| నాన్న | ఎలా ? |
| సుజాత | వీడియో కాన్ఫరెన్స్ కి అమ్మను ఒప్పించింది. |
| నాన్న | ఓహ్. |

| | |
|---|---|
| మీరా | నాకు నిద్ర వస్తుంది. మీరు అలసి పోలేదా ? |
| నాన్న | ముందు సృష్టి తో కొద్ది సేపు మాట్లాడనివ్వు – పిల్లలతో మాట్లాడక చాలా కాలమైనట్లు అనిపిస్తుంది. |
| సృష్టి | మనం సృష్టి గూర్చి మాట్లాడు కుందాం నాన్నా ... |
| నాన్న | నీ గురించి ఏం మాట్లాడమంటావ్ రా ! |
| సృష్టి | నా గురించి కాదు...సృష్టి..ఈ ప్రపంచం..ఈ creation గూర్చి. ప్రకృతి గూర్చి..పర్యావరణం గూర్చి... |
| నాన్న | ( ఆశ్చర్యంగా ) మీరా ! సృష్టి కి ఇది ఎన్నో పుట్టినరోజు. |
| మీరా | పన్నెండు నిండాయి. |
| నాన్న | ఓహ్...నా లెక్క ఏమైనా తప్పేమో అనుకున్నాను. కాలేజీ అమ్మాయితో మాట్లాడుతున్నానని భ్రమ పడ్డాను. |
| సృష్టి, సుజాత | స్వాగతం నాన్నా...నీవేమైనా అనుకునే స్వేచ్ఛ నీకుంది. |

( అందరూ నవ్వారు )